ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 30 జూలై 2024





గ్రామాల్లోకి మీ సేవ

- మహిళా సంఘాలకే కేంద్రాల కేటాయింపు
- రూ.2.50లక్షల రుణ సహాయం
- గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు
- కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశం
- జిల్లాలో 24 కేంద్రాలకు ప్రతిపాదనలు
- ఆగస్టు 15 నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు

కేసముద్రం, జూలై 29: వివిధ రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లోను నెలకొల్పడానికి సర్కారు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లోనే ఉన్న మీసేవ కేంద్రాలు ఇక నుంచి ఊరూరా ఏర్పడనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు మీసేవ కేంద్రాలను అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళా శక్తి మీసేవ కేంద్రాల ఏర్పాటుకు జిల్లాలో కసరత్తు కొనసాగుతోంది. వీటిని ఆగస్టు 15 వరకు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 24 మీసేవ కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. దశల వారీగా ప్రతీ గ్రామానికి ఒక మీసేవ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. వీటి నిర్వహణ బాధ్యత మహిళా సంఘం సభ్యులే చూసుకోనున్నారు.

135 కేంద్రాల్లో 40 రకాల సేవలు

మహబూబాబాద్ జిల్లాలో వివిధ రకాల మీసేవ కేంద్రాలు 137 ఉన్నాయి. ఇందులో ఒకటి ప్రభుత్వం నుంచి కాగా, టీఎస్ ఆన్‌లైన్ ద్వారా 15, టీఎస్ టీఎస్ 82, వన్‌స్టాప్ సర్వీసెస్(ఓఎస్ఎస్) 17 ఉన్నాయి. ఇందులో ఓఎస్ఎస్‌లో కొన్ని సర్వీసులే అందుబాటులో ఉండగా మిగతా మీసేవ కేంద్రాల్లో సుమారు 40 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. రెవెన్యూ, పోలీస్, గ్రామ పంచాయతీ, విద్యుత్, కార్మిక, దేవాదాయ, వైద్య, పౌరసరఫరాల, తదితర శాఖలకు చెందిన సేవలన్నీ అందుబాటులో ఉన్నాయి. కులం, ఆదాయం, జనన, మరణ, పోలీస్ వెరిఫికేషన్ తదితర ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ధరణి, స్థానికత, నూతన విద్యుత్ కనెక్షన్లు, రేషన్ కార్డులకు సంబంధించిన సర్వీసులన్నీ గ్రామాల్లో ఉండే మీసేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. నూతన మీసేవ కేంద్రాల ఎంపిక ప్రక్రియను జూలై 20 నుంచి చేపట్టగా ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి ప్రారంభించాలని అధికారులకు సూచనలున్నాయి.

జిల్లాలో 24 మీసేవ కేంద్రాలివే..

జిల్లాకు తొలి దశలో 24 మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మీసేవ కేంద్రాలు మంజూరు కాగా, కొన్ని మండలాలకు ఒకటి నుంచి మూడు వరకు, మరికొన్ని చోట్ల ఒక్క గ్రామానికి కూడా కేటాయించలేదు. నూతన మీసేవ కేంద్రాలను బయ్యారం మండలంలోని జగ్గుతండా, రాంచంద్రాపురం, చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి, దంతాలపల్లి మండలం దాట్ల, పెద్దముప్పారం, డోర్నకల్ మండలం అందనాలపాడు, తోడేళ్లగూడెం, గార్ల మండలం పెద్దకిష్టాపురం, పుల్లూరు, గూడూరు మండలం బొల్లెపల్లి, గుండెంగ, సీతానాగారం, కేసముద్రం మండలం ఉప్పరపల్లి, కొత్తగూడ మండలం ఓటాయి, పొగుళ్లపల్లి, కురవి మండలం కందికొండ, తట్టుపల్లి, మరిపెడ మండలం ఎడ్జెర్ల, ఎల్లంపేట, నర్సింహులపేట మండలం పడమటిగూడెం, నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం, శ్రీరాంగిరి, తొర్రూరు మండలం మాటేడు, నాంచారిమడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో మీసేవ కేంద్రం ఎంత దూరంలో ఉంది, జనాభా సంఖ్య, ఆయా గ్రామాల్లో మీసేవ దరఖాస్తుల సంఖ్యను పరిగణలోకి తీసుకొని నూతన గ్రామాలను ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

స్త్రీనిధి ద్వారా రూ.2.5లక్షల రుణం

గ్రామాల్లో నూతన మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.2.5లక్షల రుణం మంజూరు చేయనుంది. మీసేవ కేంద్రం ఏర్పాటు కోసం గ్రామైక్య సంఘానికి స్త్రీనిధి నుంచి రూ.2.5లక్షల వరకు ప్రత్యేక రుణం మంజూరు చేస్తారు. ఈ రుణంతో మీసేవ కేంద్రానికి అవసరమయ్యే కంప్యూటర్, ప్రింటర్, కెమెరా, ఇంటర్నెట్, బయోమెట్రిక్ పరికరాలు, టేబుళ్లు, కుర్చీలు తదితర వస్తువులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మీసేవ కేంద్రంలో అందించే సేవలకు కమీషన్ రూపంలో ఆదాయం వస్తుంది. గ్రామైక్య సంఘం పేరిట మీసేవ కేంద్రం ఏర్పాటు చేసుకొని అందులోని సభ్యురాలిని ఆపరేటర్‌గా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులకు మౌఖిక సూచనలున్నాయి. మీసేవ కేంద్రం నుంచి వచ్చే ఆదాయంలో 25 శాతం నిర్వహణ ఖర్చులకు, 75 శాతం ఆపరేటర్‌కు అందించాలని తెలుస్తోంది. గ్రామైక్య సంఘానికి అందిన రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాల కోసం ఆయా గ్రామాల్లో సీనియర్ గ్రామైక్య సంఘాలను గుర్తించినట్లుగా సమాచారం. ఇదిలా ఉండగా గ్రామైక్య సంఘం, సభ్యురాలిలో నూతన మీసేవ కేంద్రం ఎవరి పేరిట అనేది ఇంకా స్పష్టత రాలేదు. ఏదేమైనా గ్రామాల్లోకి మహిళా మీసేవ కేంద్రాలతో మహిళల సాధికారితతోపాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.



మహిళలకు కేటాయించడం హర్షణీయం

మాందాటి కళావతి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు

మహిళా సంఘాలకు మీసేవ కేంద్రాలను కేటాయించడం హర్షణీయం. ఈ కేంద్రాల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ కావడమే కాకుండా మహిళలు సాంకేతికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. మహిళా సంఘాలు ఈ మీసేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి.

మార్గదర్శకాలు ఇంకా రాలేదు

- జయశ్రీ, ఏపీడీ డీఆర్‌డీవో

జిల్లాలో నూతనంగా మహిళా మీసేవ కేంద్రాల ఏర్పాటు కోసం 24 గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. అయితే గ్రామైక్య సంఘాలు, సభ్యుల ఎంపిక విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రాలేదు.

భద్రాచలానికి అధిక నిధులు ఇవ్వండి

- గోదావరి కరకట్ట నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయించాలి
- పార్లమెంట్‌లో మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామ మందిరానికి ఇచ్చిన విధంగానే దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీసీతా రామచంద్ర స్వామి దేవాలయానికి అధిక నిధులు ఇవ్వాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సోమవారం ఎంపీ బలరాంనాయక్ కోరారు. అయోధ్య రామ మందిరానికి వేలాది కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేసిన విధంగా తెలంగాణలోని భద్రాచలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి అధిక నిధులు ఇవ్వాలని, భద్రాచలంలో 25కి.మీ మేర గోదావరి కరకట్టను నిర్మించేందుకు రూ.3వేల కోట్లు కేటాయించాలని కోరారు. భద్రాచలం ప్రాంత ఆదివాసీలకు వరదల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. భద్రాచలం వద్ద రాముడి పాదాలు తాకుతూ ప్రవహించే గోదావరి నదిపై కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని, గోదావరి నది ఉగ్రరూపం దాల్చితే గ్రామాలు, రోడ్లు, పొలాలు కొట్టుకుపోతాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. 1983లో కట్టిన కరకట్టలు బలహీన పడడంతో వరదలు వచ్చిన సమయంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని తద్వారా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు 25కి.మీ మేర గోదావరి నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించేందుకు ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని కోరారు. అయోధ్య రాముడికి వేల కోట్లు ఖర్చు చేసిన తరహాలోనే భద్రాద్రి రాముడికి నిధులు వెచ్చించాలని ఎంపీ బలరాంనాయక్ విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి తీజ్ ఉత్సవాలు



నెహ్రూసెంటర్, జూలై 29: బంజారాలు ప్రకృతిని ప్రేమిస్తూ సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే తీజ్ పండుగను జూలై 30 నుంచి ఆగస్టు 8 వరకు నిర్వహించుకోవాలని గోర్‌సేన గౌరవ అధ్యక్షుడు కునసోత్ హట్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి రోజు ఘంవు గాళేరో(గోధుమలు నానబెట్టుట), 31న తీజ్ బోయేరో(బుట్టల్లో గోధుమలు చల్లుట), ఆగస్టు 1న బోరడి తీజ్, 2, 3న పూజా కార్యక్రమాలు ప్రారంభం, అనంతరం ఆట పాటలు, బంజారా సంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 4న ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం, 5, 6న డమోలీతీజ్ కార్యక్రమం ఉంటుంది. 7న గణఘోర్ తీజ్ సందర్భంగా ఉపన్యాస కార్యక్రమాలు, 8న కడావో తీజ్ - తీజ్ తొడెరో(బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేయుట) కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పవిత్రమైన తీజ్ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు జరుపుకుని బంజారాలు తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. పండుగ రోజు సెలవు దినం కావాలని ప్రభుత్వాన్ని కోరే అవకాశం ఉందని హట్యానాయక్ పేర్కొన్నారు.

సీతారామ ప్రాజెక్టును పూర్తిచేయాలి

- బయ్యారం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

బయ్యారం, జూలై 29: పాత ప్రతిపాదన ప్రకారమే సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును పూర్తిచేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య అన్నారు. బయ్యారంలో ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈసందర్భంగా నాగయ్య మాట్లాడుతూ గోదావరి నదిపై నిర్మితంచ తలపెట్టిన సీతారామ ప్రాజెక్టుకు 2016లో గత సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడు వద్ద శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. కానీ ప్రాజెక్టు పనుల డిజైన్ మార్చడంతో నియోజకవర్గానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సత్తుపల్లి, వైరా ప్రాంతాలకు లబ్ధి చేకూరేలా నిర్మాణం సాగిస్తుండటంతో ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు పనులు చేపట్టి ఇల్లెందు నియోజకవర్గ రైతాంగానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బయ్యారం పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చి కాలువలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచ్చిన విధంగా బయ్యారంలో ప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పి నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో నెలకొన్న బయ్యారం ఉక్కు, సీతారామ ప్రాజెక్టు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. బంగారం తాకట్టు పెట్టి రైతులు తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమయ్య, వీరలయ్య, రాజు, శ్రీనివాస్, రాజన్న, మండల కార్యదర్శి మధు, నాయకులు వెంకన్న, రాజన్న పాల్గొన్నారు.

డయల్ 100కు తక్షణమే స్పందించాలి

- శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. మహబూబాబాద్‌లోని టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం యూఐ కేసులు, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీ, ఎస్టీ యూఐ కేసులు, పోక్సో కేసుల పరిష్కారం, గుడుంబా, ఎన్‌డీపీఎస్ యాక్టు, సైబర్ క్రైమ్, పీటీమ్స్ అంశాలపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేయాలని చెప్పారు. ప్రతి ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం సీడీ ఫైల్ పొందుపరచాలని, నేర ఛేదన కంటే, నేర నివారణ చాలా ముఖ్యమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వానికి తావివ్వొద్దని, పోలీస్ స్టేషన్లలో బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేసి చట్ట పరిధిలో కేసులు నమోదు చేసి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ప్రతి నేరస్తుడికి శిక్ష పడేలా కేసులను పక్కా ఆధారాలతో నమోదు చేయాలని చెప్పారు. నేరాల నియంత్రణకు విసబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు డ్రగ్స్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అలాగే పోలీస్ స్టేషన్లలో ఫంక్షనల్, వర్టికల్ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఎస్పీ పేర్కొన్నారు.



ఉత్తమ సేవలందించిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించిన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు..

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సూచించారు. బ్లూకోట్స్, పెట్రోకార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తీర్చాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్నారు. భూములు, సివిల్ కేసుల్లో ఎస్వోపీ ప్రకారం విచారణ చేపట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్టు కేసులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- కేసముద్రంలో దంచికొట్టిన వాన
- జిల్లా వ్యాప్తంగా 91.0 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 29: జిల్లాలో సోమవారం కేసముద్రం, డోర్నకల్, కొత్తగూడ, గంగారం, చిన్నగూడూరుతో పాటు పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కేసముద్రంలో మధ్యాహ్నం, సాయంత్రం అర్థగంటకు పైగా వర్షం దంచికొట్టింది. వ్యవసాయ మార్కెట్ ముందు భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 91.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గంగారంలో 2.2, బయ్యారంలో 6.2, గార్లలో 27.8, డోర్నకల్‌లో 17.6, మహబూబాబాద్‌లో 0.8, నెల్లికుదురులో 1.8, నర్సింహులపేటలో 9.4, చిన్నగూడూరులో 2.2, మరిపెడలో 16.2, దంతాలపల్లిలో 2.0, తొర్రూరులో 3.4, పెద్దవంగరలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 5.7 మిల్లీమీటర్ల వర్షం పడింది.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ముందు రోడ్డుపై నిలిచిన వరద నీరు

రుణమాఫీ గందరగోళం

- ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ధర్నా
- 1700 మంది రైతుల్లో ముగ్గురికే లబ్ధి



ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నగూడూరు, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ ప్రక్రియ చిన్నగూడూరు మండలంలో గందరగోళంగా మారింది. జయ్యారం ఇండియన్ బ్యాంకులో రూ.లక్ష లోపు తీసుకున్న రైతులు రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో సోమవారం బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జయ్యారం ఇండియన్ బ్యాంకులో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి 1700 మంది రైతులు రుణాలు తీసుకుంటే కేవలం ముగ్గురు రైతులకు మాత్రమే మాఫీ అయ్యాయన్నారు. తమకు అర్హతలు ఉన్నప్పటికీ ఎందుకు మాఫీ కాలేదని సంబంధిత వ్యవసాయ, బ్యాంకు అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అర్హత ఉన్న మండల రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు బొమ్మ ఉప్పలయ్య, బండి వెంకన్న, బత్తిని శ్రీనివాస్, కీమా, రెడ్డి, రవి, లక్ష్మీనారాయణ అధికారులను కోరారు.

కాగా, జయ్యారం ఇండియన్ బ్యాంకు శాఖ మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇండియన్ బ్యాంకు నోడల్ అధికారి ప్రభుత్వానికి పంపిన జాబితా టెక్నికల్ సమస్య వల్ల ఆగిపోయిందని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. మరో రెండు రోజుల్లో అర్హులైన రైతులందరికి రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

అలరిస్తున్న భీమునిపాదం

జలపాతానికి పెరిగిన పర్యాటకుల తాకిడి

గూడూరు, జూలై 29: గూడూరు మండలం సీతానగరం గ్రామ శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం వద్ద రెండు రోజుల నుంచి పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పచ్చని ప్రకృతి ఒడిలోని గుట్టలపై నుంచి భీమునిపాదం 70 ఫీట్ల ఎత్తు నుంచి వాటర్ ఫాల్స్ జాలువారుతుండడంతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. దీంతో జలపాతం సందర్శనకు రోజు రోజుకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. వాటర్ ఫాల్స్‌లో తడిసి ముద్దవుతూ... పచ్చని ప్రకృతి అందాలు పర్యాటకులను అలరిస్తుంది. సోమవారం లష్కర్ బోనాల సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భీమునిపాదం చూసేందుకు తరలివచ్చారు. జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ.. స్నేహితులు కేరింతలు కొడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో సురేష్, సీఐ బాబురావు, ఎస్సై నగేష్‌లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



భీమునిపాదం వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటకుల సందడి



కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

గూడూరు, జూలై 29: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ కారు అతివేగంగా దూసుకువెళ్లి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. మండలంలోని దామరవంచకు చెందిన నలుగురు యువకులు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గూడూరు నుంచి మహబూబాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నాయకపల్లిలో అతివేగంగా నడుపుతూ రోడ్డుపై కుక్క ఉండడంతో ఎడమ వైపుకు వాహనం తిప్పాడు. ఎడమ వైపున ఉన్న ఓ వ్యక్తి సెల్ లైట్ వేసుకుని నడుచుకుంటూ వెళ్తుండడంతో గమనించిన డ్రైవర్ ఆవెంటనే మళ్లీ కుడివైపుకు తిప్పాడు. కుడివైపున ఉన్న చిన్నకంకర కుప్పపైకి వెళ్లడం, ఆవెంటనే ఎడమవైపుకు వేగంగా దూసుకెళ్తూ తొలుత కల్వర్టును ఢీకొట్టింది. ఆపై ఓ చెట్టును, హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైరును కారు ఢీకొట్టి రోడ్డు కింది భాగంలోని పొలాల్లో పడింది. వాహనంలో ఉన్న ఎయిర్‌బ్యాగులు సకాలంలో తెరుచుకోవడంతో ముందుభాగంలో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. వాహనం నడుపుతున్న దామరవంచ తండాకు చెందిన నూనావత్ సిద్దు తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలో రోడ్డువెంట మాట్లాడుతున్న గ్రామస్తులు, చిన్నపిల్లలు, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి పక్క నుంచే కారు అతివేగంగా దూసుకుపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు.


ప్రమాదంలో గాయపడిన నూనావత్ సిద్దు

సింగరేణి స్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్

బోర్డుకు దరఖాస్తు చేసిన సంస్థ

హైదరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణా లు గల మరింత నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో వ చ్చే విద్యాసంవత్సరం నుఏంచి సింగరేణి పాఠశాలలో సెంట్రల్ బో ర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ)సిలబస్‌ను బోధించాలని ఆ సంస్థ నిర్ణయించింది. దీనికోసం తొలుతగా రామగుండం-2 ఏరియా ఇంక్లైన్ కాలనీలో ఉన్న సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సింగరేణి సంస్థ దరఖాస్తు సమర్పించింది. దీనికన్నా ముందు తెలంగాణ విద్యాశాఖనుం చి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకొని దరఖాస్తును సమర్పించింది. దాంతో పాఠశాలను పరిశీలించడానికి వీలుగా త్వరలోనే సీబీఎస్ఈకి చెందిన ఉన్నత స్థాయి బృందం రామగుండం చేరుకొని, తరగతి గదులను, పాఠశాల క్రీడా మైదానం , ప్రయోగ శాలలు, ఇతర మౌలిక వసతులు తదితర అన్ని అంశాలను పరిశీలించి, తగి న సిఫారసులు చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి రామగుం డం లో, ఆ తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోనూ దీన్ని అందుబాటు లోకి తీసుకురావాలని నిర్ణయించారు.


కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 29 : కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎంజీఎం ఆస్పత్రి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆవరణలో సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ అసంఘటిత కార్మికుల సమాఖ్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 4న వరంగల్‌లో కార్మిక వర్గ హక్కుల కోసం, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేత నం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్, పేషంట్ కేర్ ఉద్యోగులను తక్షణ మే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సి బ్బంది గొర్రె నాగరాజు, ఆర్.రాజు, సుధాకర్, పుష్ప, రాజవీరు, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, నాగరాజు, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





















సీఎంకు పండుగల పంచాంగం అందజేత



సీఎంకు పండుగల జాబితాను అమ్మవారి ప్రసాదాన్ని అందించిన సభ్యులు

వరంగల్ కల్చరల్, జూలై 29: తెలంగాణ విద్వత్‌సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు ధర్మశాస్త్రాలకు అనుగుణంగా పండుగల నిర్వహణను తెలియజేసే 2025-26 విశ్వవసు నామ సంవత్సర జాబితా(పంచాంగం)ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం అందించారు. అలాగే, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో సభ బాధ్యులు సమర్పించారు. వారు మాట్లాడుతూ విద్వత్‌సభ వారికి ఏ అవసరం వచ్చినా తీర్చాలని దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిలిచ్చినట్టు పేర్కొన్నారు. పండుగల నిర్వహణలో ఎలాంటి అనిశ్చితి లేకుండా జాబితాను నిర్ధారించి అందించినందుకు మంత్రి సురేఖ అభినందించారన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు(వరంగల్), యాదాద్రి దేవస్థానం ఛైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నర్సింహచార్యులు(యాదాద్రి), విద్వత్‌సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి(మేడపల్లి-నల్లగొండ), కోశాధికారి ఎంవీఆర్ శర్మ(హైదరాబాద్), వేదపండితులు నటార్‌శర్మ(వరంగల్), సాయిదీక్షిత్(వరంగల్) పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్లను వెంటనే నియమిం చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొం డలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగేశ్వర్ మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో పారిశుధ్య పనులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో బీఈడీ కలిగి ఎస్జీటీలు నష్టపోయారని, వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. చాలా పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మాణమ య్యా యని, వాటి నిర్వహణకు స్కావేంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెం డింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి. వెంకటేశ్వర్లు, పి. మనోజ్, స్వామి, తన్వీర్, బుచ్చాచారి, అశోక్, పూర్ణ చందర్, రమేష్, రవి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్‌కు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం పీడీ



కొమ్ము రాజేందర్

కేసముద్రం, జూలై 29 : ప్యారిస్‌లో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరిగే పారా ఒలింపిక్స్‌కు దేశం తరపున బ్యాడ్మింటన్ క్రీడకు టెక్నికల్ అఫిషియల్‌గా కేసముద్రం జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ పి.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా రాజేందర్ గతంలో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, బ్యాడ్మింటన్ ఏషియా, ఏషియన్ స్కూల్ గేమ్స్, కామన్ వెల్త్ క్రీడలు, మూడుసార్లు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, టాటా ఓపెన్ ఇంటర్నేషనల్, ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్, ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, నేషనల్ గేమ్స్, సౌత్ జోన్ క్రీడలతో పాటు అనేక జాతీయ స్థాయి క్రీడలకు అంపైర్‌గా వ్యవహరించినట్లు చెప్పారు. తాజాగా వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ వారు టెక్నికల్ అఫిషియల్‌గా రాజేందర్‌ను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కోశాధికారి నాగకిషన్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం బి.రాజు, ఉపాధ్యాయ బృందం, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌పీఐ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయ



విజయ

వడ్డెపల్లి, జూలై 29 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) బొజ్జా తారకం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా హనుమకొండ పట్టణానికి చెందిన చేపూరి విజయ నియమితులయ్యారు. ఆర్‌పీఐ బొజ్జా తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఆదేశం మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్, ఆర్‌పీఐ వ్యవస్థాపకులు బొజ్జా తారకం ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని చేపూరి విజయ పేర్కొన్నారు.

ఆదుకోవాలని కళాకారుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, జూలై 29 : ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో అమరవీరుల అనంతరం గళమెత్తి ఉద్యమించిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కళాకారులు నిరసనగా భిక్షాటన చేశారు. వరంగల్ చౌరస్తాలో ఒక బృందం, హనుమకొండ చౌరస్తాలో ఒక బృందం కళాకారులు భిక్షాటన చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలంటూ కోరారు. రోడ్డుప క్కన ఉన్న షాపుల్లోకి వెళ్లి భిక్షాటన చేశారు. కళాకా రుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. సకల కళా సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, ఎస్ కే.రాజు, బిర్రు సురేం దర్, గుండెకారి సునీల్, సదానందం, డప్పు కార్తీక్, వెంకట్, హను మకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి, రాయబారపు సాంబయ్య తదితర సుమారు 100 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో పదోన్నతులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 29 : ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు నిర్వహించగా కొన్ని ఖాళీలు మిగిలాయి. వరంగల్ జిల్లాలో 43 ఖాళీలు ఏర్పడగా హనుమకొండ జిల్లాలో సైతం 43 ఖాళీలే ఏర్పడ్డాయి. దీంతో మిగులు ఖాళీల్లో సైతం అర్హులైన ఉపాధ్యాయులకు సోమవారం పదోన్నతులు కల్పించారు. వరంగల్ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలు 4, హిందీలో 5, ఫిజికల్‌సైన్స్‌లో 1, సోషల్ స్టడీస్‌లో 9, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, తెలుగులో 7, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. అయితే వరంగల్‌లో 40 మంది ఉపాధ్యాయులకి మాత్రమే ప్రమోషన్ రాగా, మిగతా మూడు ఖాళీల్లో సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో 3 ఖాళీలు అలాగే ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో పీఎస్ హెచ్‌ఎంలలో 11, సోషల్ స్టడీస్‌లో 16, బయోసైన్స్‌లో 8, ఇంగ్లీష్‌లో 7, ఫిజికల్ సైన్స్‌లో ఒక్కరు పదోన్నతి పొందారు. వీరందరికి సోమవారం ఆర్డర్లు ఇవ్వగా మంగళవారం పాఠశాలల్లో జా యిన్ కానున్నారు.

సీపీ పేరిట నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు

వరంగల్ క్రైం, జూలై 29 : సైబర్ నేరగాళ్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేరిట నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేశారు. నకిలీ ఫేస్ బుక్ క్రియేట్ చేసి పలువురు ఖాతాదారులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు. ఈ విషయమై అప్రమత్తమైన కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ పేరిట వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు ఎవరూ స్పందించకూడదని పేర్కొన్నారు. ఇది నకిలీ ఫేస్ బుక్ అని గుర్తించాలని వారు పేర్కొన్నారు.

శిల్పారామం ఏర్పాటెప్పుడు?

- రూ.6కోట్లు ఇచ్చినా ముందుకు పడని అడుగు
- పట్టించుకోని గత బీఆర్ఎస్ సర్కార్
- స్థలం ఎంపికపైనే ఎడతెగని తకరారు
- ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలంటున్న నగర వాసులు

పద్నాలుగేళ్ల క్రితం మంజూరు

హైదరాబాద్‌లోని ఈ శిల్పారామం తరహాలోనే వరంగల్‌లోనూ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు..



హన్మకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా శిల్పారామం ఏర్పాటు చేస్తామని పద్నాలుగేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు రూ.6కోట్లకు పైగా నిధులను కూడా మంజూరు చేసింది. కానీ ఆ పనులు నేటికీ మొదలవలేదు. అసలు శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపైన ఏర్పడిన తకరారు ఇప్పటికీ సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని వరంగల్ నగర వాసులు పేర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సాకారం కాని తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చాలని కోరుతున్నారు.

14 ఏళ్లనాటి కల..

నగర వాసుల శిల్పారామం కల ఇప్పటిది కాదు. పదమూడేళ్లనాటిది. నాటి ప్రభుత్వం నిధులిచ్చినా ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో స్పష్టత లేకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. అనువైన స్థలం గుర్తింపులో అధికారుల వైఫల్యం గ్రహపాటుగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శిల్పారామం మంజూరైంది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో ఏర్పాటుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శిల్పారామం ఏర్పాటులో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత కాలంలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. సీఎం కేసీఆర్ వరంగల్ నగరాన్ని సందర్శించినప్పుడు వరంగల్‌తో త్వరలో శిల్పారామం ఏర్పాటుపై ఇచ్చిన హామీ, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆయా సందర్భాల్లో చేసిన ప్రకటనలు గాలిమాటలుగానే మిగిలి పోయాయి. స్థానికంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు, పట్టణాల్లో నివసించే వారికి పల్లె వాతావరణం రుచి చూపేందుకు, వివిధ ప్రదర్శనల ద్వారా స్థానిక కళాకారులకు ఉపాధి కల్పించేందుకు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయాలని 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌తో పాటు సంగారెడ్డి, కడప, విశాఖపట్టణం, తిరుపతి, అనంతపూర్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు శిల్పారామం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు కసరత్తు చేసినా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

మూలుగుతున్న నిధులు

వరంగల్‌లో ఏర్పాటు చేసే శిల్పారామంలో వివిధ చేతి వృత్తుల అమ్మకానికి 40కి పైగా స్టాళ్లు, నాటక, కళా ప్రదర్శనలకు ఎపెన్ ఏయిర్ థియేటర్, ఒక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయాలని, శిల్పారామంలో చిన్నపాటి చెరువును ఏర్పాటు చేసి అందులో పిల్లల ఆహ్లాదానికి బోటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. అదనపు ఆకర్షణగా రాక్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి అంచనా ప్రకారం మొత్తం రూ.12కోట్ల వ్యయం కాగా దశల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వం తొలి విడతగా రూ.5కోట్లను, ఆ తర్వాత రూ.కోటి 14 లక్షలను మంజూరు చేసింది. మొత్తంగా రూ.6.14కోట్లు విడుదలైనా ఇప్పటికీ అవి ఖర్చు కాకుండా మూలుగుతున్నాయి. శిల్పారామం ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి లభిస్తుంది. హస్తకళాకారులు తాము తయారు చేసిన కళారూపాలకు, ప్రధానంగా చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ లభిస్తుంది. పర్యాటకులు, నగరవాసులకు ఆహ్లాదం కూడా అందుతుంది.

స్థల ఎంపికలో తకరారు..

శిల్పారామం ఏర్పాటుకు స్థలం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో అధికారులు తుది నిర్ణయానికి రాలేక పోతున్నారు. ఇప్పటి వరకు అయిదారు చోట్ల స్థలాలను చూశారు. వీటిలో కొన్నిటిని ఖరారు చేశారు. చివరి నిమిషంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. శిల్పారామంను మొదట హన్మకొండ గోపాలపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఓ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల స్థలం ఈ స్థల సేకరణకు అధికారులు కొంత కసరత్తు చేశారు. అయితే ఈ స్థలంలో అప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినందు వల్ల శిల్పారామం ఏర్పాటు సాధ్యం కాదని భావించిన అధికారులు ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఖిలా వరంగల్ కోట సమీపంలోనూ స్థలాన్ని చూసిన అధికారులు పర్యాటక ప్రాంతమైన ఓరుగల్లు కోటకు దగ్గరగా ఉందని, ఈ స్థలం అనుకూలమైందని భావించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. కానీ కేంద్ర పురావస్తు శాఖ అభ్యంతరం చెప్పడంతో అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. హన్మకొండ బాలసముద్రంలో హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న అయిదు ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అయితే ఈ స్థలం సరిపోదని, పైగా ఇది ఇళ్ల మధ్యలో ఉందని అధికారులు ఆ ఆలోచనను కూడా మానుకున్నారు. నగర శివార్లలోని హసన్‌పర్తిలో ఏర్పాటు చేసే విషయమై కూడా అధికారులు పరిశీలించారు. మామూనూరు సమీపంలో బెస్తం చెరువును అనుకొని జయశంకర్ స్మృతి వనం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. నగరానికి 8కిలోమీటర్ల దూరంలో వరంగల్-ఖమ్మం రోడ్డును ఆనుకొని ఉన్న ఈ స్థలం శిల్పారామానికి అనువైనదిగా భావించారు. అప్పుడు కూడా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ (వైటీడీసీ) వైస్‌ఛైర్మెన్ కిషన్‌రావు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి ఈ స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 60 ఎకరాల్లో శిల్పారామానికి 15 ఎకరాలు కేటాయించేందుకు నాటి కలెక్టర్ వాకాటి కరుణ అంగీకరించారు. కానీ అక్కడ కూడా ఏర్పాటు కాలేదు. చివరికి 2019 సెప్టెంబరు 19న నాటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హైదరాబాద్ శిల్పారామం జనరల్ మేనేజర్ కిషన్‌దాస్ వరంగల్ హంటర్ రోడ్డులో జూపార్క్‌కు ఎదురుగా, ప్రాంతీయ సైన్స్ కేంద్రం సమీపంలో అందుబాటులో ఉన్న సుమారు 30ఎకరాలను పరిశీలించారు. ఇక్కడ శిల్పారామం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపించారు. కానీ రెండేళ్లవుతున్నా ఓ కొలిక్కి రాలేదు. ఇక్కడ ఇప్పటికే ఆక్రమణలు, నిర్మాణాలున్నాయి. పైగా పూర్తిగా గుట్ట ప్రాంతం. ఇక్కడికి చేరుకోవడానికి దారి లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ సైన్స్ సెంటర్ నుంచే వెళ్లాల్సి ఉంటుందన్న ఆక్షేపణలున్నాయి. కానీ నాడు ఎమ్మెల్యే, కలెక్టర్, వైటీసీ వైస్ ఛైర్మెన్, మాజీ ఐఏఎస్ అధికారి, ఆర్ట్ డైరెక్టర్ తదితరులు సమీక్షించడంతో పెండింగ్‌లో ఉన్న శిల్పారామానికి కూడా మోక్షం లభించనట్టేనని నగరవాసులు భావించారు. కానీ ఆ తర్వాత అంతా మొదటికే వచ్చింది. అయితే అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందు ఓటర్లను ఆకట్టుకునేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత హడావిడి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా శిల్పారామాన్ని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

అక్టోబరులో జూపార్కుకు పెద్దపులి

వర్షాల కారణంగా టైగర్ జోన్ ఏర్పాటుకు ఆటంకం



వర్షం నీళ్లు చేరడంతో నిలిచిన టైగర్‌జోన్ పనులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 29 : వచ్చే అక్టోబరులో హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు పెద్దపులి రానుంది. మూడు నెలల క్రితం జూపార్కులో అధికారులు టైగర్ జోన్ ఏర్పాట్లు ప్రారంభించారు. వాస్తవానికి టైగర్ జోన్ పనులు ఇప్పటికే పూర్తిచేసి జూపార్కుకు పెద్దపులిని తీసుకురావాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో టైగర్ జోన్ చుట్టు కంచె ఏర్పాటు చేసేందుకు గుంతలు తీయగా ఆ గుంతల్లో వర్షనీరు చేరి పనులకు ఆటంకం కలిగింది. మూడు నెలల్లో టైగర్‌జోన్ పనులు పూర్తిచేసి పెద్దపులిని తీసుకువస్తామని జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపినప్పటికీ వర్షాల కారణంగా పనులు ఇప్ప టికే 70శాతం వరకు మాత్రమే పూర్తయ్యాయి. వ చ్చే సెప్టెంబర్ నెల చివరి వరకు టైగర్ జోన్ పనులు పూర్తిచేసి జూపార్కుకు పులిని తీసుకు వచ్చేందుకు అటవీ శాఖ అధికారులు పనులు వేగవం తం చేశారు. ఎంతోకాలంగా నగరంలో పులిని చూద్దాం అనుకునే ప్రజలకు మరో రెండు నెలల్లో పులి జూపా ర్కులో కనిపించనుంది.

వర్షాల కారణంగా టైగర్‌జోన్ పనులు ఆలస్యం

మయూరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



మూడు నెలల్లో జూపార్కులో టైగర్‌జోన్ పనులు పూర్తి చేసి పులిని తీసుకొద్దామనుకున్నాం. వర్షాలు పడటం వలన టైగర్‌జోన్ పనులు చేసే ప్రాంతంలో నీళ్లు నిలిచి పనులు చేయడానికి కొంతవరకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రస్తుతం ఇంకా ఇక్కడికి పులిని తీసుకువచ్చే కండిషన్ లేదు. పులిని కొత్త ప్రదేశానికి తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 70శాతం వరకు టైగర్‌జోన్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం బారికేడ్స్ పనులు జరుగుతున్నాయి. లోపల ఇంకా టైల్స్ వేయాలి. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు పనులు పూర్తి చేసి అక్టోబర్‌లో జూపార్కుకు పెద్దపులిని తీసుకువస్తాం.

వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు పేరుతో చోరీలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు .. రెండుకార్లు స్వాధీనం

మట్టెవాడ, జూలై 29 : వాహనాల ట్రాన్స్‌ఫోర్ట్ పేరుతో దొంగతనాలకు పాల్పడున్న అంతర్ రాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. సోమవారం దొంగల ముఠా అరెస్టు వివరాలను ఏసీపీ వెల్లడించారు. రెండు సంవత్సరాల నుంచి ఉత్తరప్రదేశ్‌కు ఆగ్రాకు చెందిన కృష్ణ కాంత్ సక్సేనా, రాజస్థాన్ రాఊంపాళీ ప్రాంతానికి చెందిన అనిల్ సోమకి, వికాస్‌లు వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌ఫోర్టు, పార్సల్ సర్వీస్ వారి దగ్గరకు కస్టమర్ వెహికల్ ట్రాన్స్‌ఫోర్టు చేసేందుకు వారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తూ దూర ప్రాంతాలకు కారును ట్రాన్స్‌ఫోర్టు చేయుటకు వారికి వాహనం ఇచ్చినప్పుడు ముగ్గురు కలిసి వాహనం నెంబరు ప్లేట్‌ని మార్చి, వరంగల్, హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. జూన్ 22న మహారాష్ట్ర గోండియా జిల్లాకు చెందిన వికాస్‌కు చెందిన ఎకోస్పోర్ట్ కారును జైపూర్‌లోని రిలీఫ్ రీ లొకేషన్ పార్సెల్ సర్వీసు వారి వద్ద నుంచి మహారాష్ట్ర గోండియాలో డెలీవరి కోసం తీసుకొని, ఆ వాహనంలో గతంలో దొంగతనాలకు పాల్పడిన విధంగా జూన్ 24న వరంగల్‌కు వచ్చి హంటర్‌రోడ్‌లోని ఓస్వాల్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ. 2 లక్షల విలువైన ఫినోలెక్స్ ఎలక్ట్రికల్ వైరును దొంగిలించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం ఆగ్రాకు చెందిన కృష్ణకాంత్ సక్సేనను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఎకోస్పోర్ట్, మారుతి రిడ్జ్ కార్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ తెలిపారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ నవీన్ కుమార్, మట్టెవాడ క్రైమ్ పార్టీ పోలీసు సిబ్బంది అలీ, విజయ్, రాజు, తిరుపతి, నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ టీం సల్మాన్‌లను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.



అరెస్టు చూపుతున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మహాలక్ష్మీ పథకంతో పెరిగిన ఆదాయం

ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం విజయభాను


బాలసముద్రం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని వరంగల్ రీజనల్ ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను అన్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం విజయభాను మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో మొత్తం 928 బస్సులు ఉన్నట్లు తెలిపారు. మహాలక్ష్మీ పథకం కోసం 759 బస్సులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులలో 9 కోట్ల 46 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించగా 5 కోట్ల 78 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసి మహాలక్ష్మీ స్కీంను వినయోగించుకున్నట్లు ఆయన తెలిపారు. పెరిగిన ప్రయాణికులకు గాను ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను సమయాలను క్రమబద్ధీకరించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా 20 రూట్లలో ప్రజలు ప్రజాపతినిధుల విజ్ఞప్తుల మేరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ప్రయాణికులు ప్రయాణం పెరిగిందని హైదరాబాద్, కరీంనగర్, మరి కొన్ని రూట్లలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు త్వరలో 42 బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. మహాలక్ష్మీ పథకం ప్రారంభించినప్పటి నుంచి వరంగల్ రీజియన్‌కు రూ.554 కోట్ల 63లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మహాలక్ష్మీ ప్రయాణీకుల ద్వారా రూ.293 కోట్ల 58లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రస్తుతం వరంగల్ బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ గ్రామానికి త్వరలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు భానుకిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రీ వాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురుచూపు

కేయూ డిగ్రీ సెమిస్టర్ విద్యార్థుల హైరానా

నిర్ణీత గడువు ముగిసినా ఫలితాల ఊసేలేదు



ఆన్‌లైన్‌లో రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న రశీదు

కేయూ క్యాంపస్, జూలై 29 : కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ రీవాల్యూవేషన్ ఫలితాల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గత డిసెంబరులో వర్సిటీ డిగ్రీ కోర్సుల 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థుల పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్‌లో పరీక్షల ఫలితా లను విడుదల చేశారు. అయితే చాలా మంది విద్యా ర్థులు తమ పరీక్షల ఫలితాలను రీవాల్యూవేషన్ చేయాలని దరఖాస్తులు వర్సిటీ అధికారులకు చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 305 చెల్లిం చారు. వర్సిటీకి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. సాధారణంగా నెల రోజుల్లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ తమ సబ్జెక్టులలో రీవాల్యూవేషన్, రీ కౌంటింగ్ చేసి ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు తాము దరఖాస్తులు చేసుకున్నటువంటి సబ్జెక్టు మంచిగా రాసినట్లయితే రీవాల్యూవేషన్, రీకౌంటింగ్‌లో బెనిఫిట్ పొందుతారు. లేక నాట్ బెనిఫిట్ అని ఫలి తాలు వస్తాయి.

రీవాల్యూవేషన్‌కు దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా వర్సిటీ అధికారులకు ఫలితాలను వెల్లడించాలనే ఊసే రావడం లేదు. దరఖాస్తులు చేసుకున్నప్పటి నుంచి నెల 15 రోజుల్లో ఫలితాలను వెలువరించాలనే నిబంధనలున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలి తాల కోసం విద్యార్థులు కాలం గడుస్తుండటంతో కళ్ళు కాయలు కాసేలా చూస్తున్నారు.

6వ సెమిస్టర్‌ది ఇచ్చారు.. మిగతావి మరిచారు...

ఉన్నత విద్య ప్రవేశాలకు వేళ్ళే విద్యార్థుల వెసులుబాటును ఆలోచించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డిగ్రీ 6వ సెమిస్టర్ రీవాల్యూ వేషన్ ఫలితాలను ఇచ్చారు. మిగతా 1, 2,3, 4, 5వ సెమిస్టర్ డిగ్రీ కోర్సులు ఫలితాలను మరిచారు. అయితే 1 నుంచి 5వ సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జె క్టు తప్పిన విద్యార్థి ఉన్నట్లయితే ఉన్నత విద్య ప్రవే శాలకు అర్హత కోల్పోతారు. దీన్ని గుర్తించని వర్సిటీ అధికారులు విద్యార్థులకు లాభం చేశామనే ఉద్దేశ్యం తో కేవలం 6వ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితా లను వెల్లడించి చేతులు దూలుపుకోవడంపై విద్యా ర్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తాం..

ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ పరీక్షల నియంత్రణాధికారి

వారం రోజుల్లో డిగ్రీ సెమిస్టర్ రీవాల్యూవేషన్ ఫలితాలను విడుదల చేస్తాం. రీవాల్యూవేషన్ ప్రాసెస్ పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దు. వీలైనంత త్వరగా ఫలితాలను విడుదల చేస్తాం.

వివాహాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులు

▸ మానుకోట డిపో మేనేజర్ శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, జూలై 29 : మహబూబాబాద్ డిపో నుంచి వివాహాలు, శుభకార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు మాసంలో పెళ్లి ముహుర్తాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చేందుకు మహబూబాబాద్ డిపో సిద్ధంగా ఉందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సౌకర్యవంతంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మానుకోట పరిసరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇతరవివరాలకు 9948214022, 9989009327 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్టాండ్ ఆవరణలో మాట్లాడుతున్న డీఎం పద్మావతి

తొర్రూరు, జూలై 29 : వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో సిబ్బందికి టార్గెట్‌లపై అవగాహన కల్పించి ఆమె మాట్లాడారు. వివాహాది శుభకార్యాలకు, విహార యాత్రలకు, ఇతర కార్యక్రమాలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అద్దెకు ఇస్తామని, ప్రజలు వచ్చే శ్రావణ మాసంలో ఆర్టీసీ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది సంస్థ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. బస్సు అద్దెల కోసం ఫోన్ 99592 26053, 70321 82456 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ కుమార్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరించాలి

▸ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్

మహబూబాబాద్ టౌన్, జూలై 29: సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం నిర్వహించిన హమాలీకార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి రేట్లను పెంచడంతో పాటు వారిని నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు రెండు జతల యూనిఫామ్ దుస్తులను అందించాలని, 50 సంవత్సరాలు దాటిన సివిల్ సప్లై హమాలీ కార్మికులకు నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 31న జరుపతలపెట్టిన చలో హైదరాబాద్‌కు భారీగా తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వంకాయలపాటి జక్కరయ్య, నాగేశ్వరరావు, ప్రభాకర్, సురేష్, వెంకన్న, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

▸ నిలిచిన తాగునీటి సరఫరా

డోర్నకల్, జూలై 29: డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు మండలంలోని ఉయ్యాలవాడ, చాంప్లాతండా, అమ్మపాలెం, తహసీల్దార్ బంజర గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్ సోమవారం డోర్నకల్ శివారులోని సమ్మర్ స్టోరేజ్ వద్ద పగిలిపోయింది. దీంతో డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఓ ప్రైవేట్ టెలికాం సంస్థ కేబుల్ మరమ్మతుల కోసం ప్రొక్లెయినర్‌తో కందకాలు తీస్తుండగా పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న ధ్వంసమైన పైపులైన్ వద్దకు చేరుకుని మిషన్ భగీరథ, మునిసిపల్ సిబ్బందితో వెంటనే మరమ్మతులు చేయించారు.

నేడు రెండో విడత రుణమాఫీ

▸ జిల్లాలో 16,611 మంది రైతులకు లబ్ధి

▸ రూ.178.39 కోట్లు మాఫీ

▸ వర్చువల్ విధానంలో 12 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి నిధుల విడుదల



నెల్లికుదురు మండలం బడితండా శివారులో వరినాటు వేస్తున్న రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 29 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ పథకం పండుగ వాతావరణంలా జరుగుతుంది. ఆగస్టు 15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటామని ప్రతిపక్షాలకు సవాల్ చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తూ ముందుకు కదులుతున్నారు. రెండో విడత రూ.1.5లక్షల రుణమాఫీ నిధులను హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వర్చువల్ విధానంలో విడుదల చేస్తారు. రెండో విడత రుణమాఫీలో మహబూబాబాద్ జిల్లాకు 16,611 మంది రైతులకు రూ.178.39కోట్ల మాఫీ జరుగనుంది. జిల్లాలో ఇప్పటికే మొదటి విడతలో 27,542 మందికి మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్

ఈసారి రైతు వేదికల్లో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించడానికి, రైతులు, అధికారులతో సమీక్షించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు సోమవారం తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 250 మంది రైతులను ఎంపిక చేసి కలెక్టరేట్‌కు తరలిస్తారని చెప్పారు. అందుకోసం రైతులు, వ్యవసాయాధికారులు, సహకార అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు మంగళవారం ఉదయం 11గంటల వరకే సమావేశ మందిరంలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐదుగురు రైతులను ఎంపిక చేసి వారికి రుణమాఫీ చెక్కులను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా పంపిణీ చేస్తారు. కాగా, సోమవారం మధ్యాహ్నం జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు రుణమాఫీపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మహబూబాబాద్, మరిపెడ ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు, వివిధ మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. కాగా, మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతులందరికి మాఫీ జరుగకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

2న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 29 : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఆగస్టు 2న జరుపతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేసిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ దశలవారీ పోరాటాలను కొనసాగిస్తుందని చెప్పారు. విభజన చట్టంలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమను వెంటనే నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. 2న ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

▸ మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న



వడ్డెర కాలనీలో మట్టి రోడ్డుపై మొరం పోయిస్తున్న వెంకన్న

మహబూబాబాద్ టౌన్, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయనున్నట్లు మానుకోట మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయమైన మహబూబాబాద్ మునిసిపల్ 24వ వార్డు పరిధిలోని వడ్డెర కాలనీ, లెనిన్‌నగర్, మరికొన్ని కాలనీల్లోని రోడ్లపై సోమవారం మొరం పోయించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... పలు కాలనీల్లోని రోడ్లు బురదమయమై ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మొరం పోయించి చదును చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మార్నేని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

▸ పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కందాల రంగయ్య

మహబూబాబాద్ టౌన్, జూలై 29: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు కందాల రంగయ్య విమర్శించారు. మహబూబాబాద్‌లో సోమవారం జరిగిన పీవైఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ... ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లోని గ్రామాల్లో కనీసం పారిశుధ్య చర్యలు కరువయ్యాయని అన్నారు. ఫలితంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పల్లెలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా ప్రభుత్వం స్పందించకపోతే సంఘం ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఇరుగు అనిల్, నాయకులు ఏరుగొండ ప్రవీణ్, ధారవత్ సంతోష్, మంగళంపల్లి మధు పాల్గొన్నారు.

ఇఫ్టూ జాతీయ జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ

మహబూబాబాద్ టౌన్, జూలై 29: మహారాష్ట్రలోని పూణేలో ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని కె.విశ్వనాథ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరెల్లి కృష్ణ మాట్లాడుతూ... సీతారామ ప్రాజెక్టు ద్వారా మానుకోటకు నీరందించాలని, సింగరేణిలోని ఆరు బొగ్గు బ్లాకుల వేలంపాట నిర్ణయాన్ని వెంటనే కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పాలని, కుటీర పరిశ్రమలపై జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో కార్మికుల సంక్షేమం కోసం నిధుల కేటాయింపులు లేకపోవడం శోచనీయమన్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం భద్రతతో కూడిన ఉపాధి కల్పించాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని కార్మికవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అసంఘటిత కార్మికులకు నెలకు రూ.26,500 వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే.మదార్, సహాయ కార్యదర్శి నున్నా అప్పారావు, ఎస్.దుర్గాప్రసాద్, మాందాటి శ్రీనివాస్, పసునూరి రాజు పాల్గొన్నారు.

'దోస్త్'లో కేసముద్రం డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

కేసముద్రం, జూలై 29: కేసముద్రంలో నూతనంగా ఈ విద్యా సంవత్సరం ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు 'దోస్త్' పోర్టల్‌లో మొదటి ఆప్షన్ ఇవ్వాలని ప్రిన్సిపాల్ రాజు సోమవారం తెలిపారు. ఈ కళాశాలలో బీఏ(కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(కంప్యూటర్స్), బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) గ్రూపులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అడ్మిషన్లలో ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని, 77807 01084 నంబరుకు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

డోర్నకల్, జూలై 29 : జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అక్రమ డిప్యూటేషన్‌లను వెంటనే రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో సోమవారం వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా తనకు అనుకూలంగా ఉన్న వారికి డిప్యూటేషన్లు కల్పిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక అవినీతి జరుగుతుందని, వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు వారం రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా అక్రమ డిప్యూటేషన్‌లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ డిప్యూటేషన్లను నిరసిస్తూ ఆగస్టు 3న ధర్నా చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో సోమనబోయిన శ్రీనివాస్, శంకర్, సాహెబ్‌అలీ, కాసు మారెడ్డి, లక్ష్మీప్రసాద్, సీతారాములు, బుచ్చయ్య, సీతారామారావు, రాములు పాల్గొన్నారు.

చదువే మనిషిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతుంది

▸ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థి పార్థసారథిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, జూలై 29: చదువే మనిషిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని, తద్వారా సమాజంలో గౌరవం లభిస్తుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇటీవల వెల్లడైన పాలిసెట్ ఎంట్రెన్స్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించిన విద్యార్థి ముత్యాల పార్థసారథిని సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్య మానవ మనుగడకు, గౌరవానికి ప్రతీక అని చెప్పారు. మానుకోట నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి నిమిషం ఎంతో విలువైందని సూచించారు. ఈ కార్యక్రమంలో శంతన్‌రామారాజు, కమ్మగాని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీవాసులకు పట్టాలివ్వాలి

కేసముద్రం, జూలై 29: మండలంలోని తాళ్లపూసపల్లిలో అంబేద్కర్‌నగర్ కాలనీలో నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ఆ గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12వేలు అందించాలని కోరారు. సమావేశంలో జ్యోతి, డి.సరిత, శారద, కళావతి, నర్సమ్మ, రజిత, టి.శేఖర్, సంపత్, ఉపేందర్, వెంకన్న, మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం తీరుపై సీఎంను కలుస్తాం

▸ ఏకపక్షంగా వ్యవహరిస్తూ అవమానిస్తున్నారు

▸ గార్ల మండలానికి చెందిన పలువురు నేతల వ్యాఖ్య

▸ పుల్లూరులో సమావేశమైన ముఖ్య నాయకులు



పుల్లూరులో సమావేశమైన నాయకులు

గార్ల, జూలై 29: గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించి బీఆర్ఎస్‌లో చేరి.. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చి ఇల్లెందు టికెట్ దక్కించుకున్న కోరం కనకయ్య గెలుపులో తాము కీలక పాత్ర పోషించామని, కానీ ఆయన నియోజకవర్గంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను అవమానపరుస్తున్నాడని మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన పలువురు నాయకులు ఆరోపించారు. సోమవారం గార్ల మండలంలోని పుల్లూరు గ్రామంలో సమావేశమైన పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుతూ తాము కోరం కనకయ్య గెలుపునకు ఎంతో కృషి చేశామని, కానీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కనకయ్య తీరులో మార్పు రాకపోగా గతంలో చేసిన విధంగానే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఈ విషయంలో తాము త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరిస్తామన్నారు. కోరం కనకయ్య మండలాల వారీగా తన ముఖ్య అనుచరులను ఏర్పాటు చేసుకొని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా ఏ ఆఫీసుకు వెళ్లినా ఏపని కాకుండా అడ్డుకుంటూ అవమాన పరుస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తన మనుషులు చెబితేనే పనులు చేయాలని అధికారులకే హుకుం జారీ చేస్తున్నాడని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఎన్నికల్లో ఆయన గెలుపునకు పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు నాడు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులను కూడా కలుపుకొని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని, అలాగే ఎమ్మెల్యే తీరుకు నిరసనగా ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకు గార్ల మండల కేంద్రంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావూరి వెంకట్రామయ్య, సూరపురెడ్డి వెంకటరెడ్డి, గుండా వెంకటరెడ్డి, జాస్తి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, శంషాద్ బేగం, నాడు ఎన్నికల్లో మద్దతు తెలిపిన రాజకీయ పార్టీల నాయకులు ఆళ్ల సాంబశివరావు, ఎలమరెడ్డి కృష్ణారెడ్డి, హతిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

తొర్రూరు, జూలై 29: న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మాల, మహర్ కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యాయ స్థానాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రత్యేక చట్టాలను తేవాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లు, బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లకు చట్టం తీసుకురావాలన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ఆగస్టు 7వ తేది నుంచి ఢిల్లీలో జరిగే సామాజిక చైతన్య దీక్షలకు మాల మహానాడు బిడ్డలు, బీసీలు హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎనమల రాకేష్, ప్రశాంత్, చిట్టిమల్ల మహేష్, నగేష్, అశోక్, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



అనాథలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

తొర్రూరు, జూలై 29: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవసరార్థులకు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ కోశాధికారి చీదర మహేష్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డుల్లో అనాథ మహిళలు 50 మందికి చీరల పంపిణీ, సుమారు 500 మందికి అన్నప్రసాద వితరణ చేసి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు మహేష్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్, కార్యదర్శి తమ్మి రమేష్, బోనగిరి శంకర్, లక్ష్మీనర్సింహరావు, కిరణ్‌కుమార్, శ్రీదేవి, వెంకన్న, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

▸ పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భద్రినారాయణ



రవీందర్ దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 29 : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రినారాయణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో సోమవారం కేసముద్రం మండలం అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మడుపు రవీందర్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భద్రినారాయణ మాట్లాడుతూ... సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో విధులు నిర్వహించి వేలాది మందిని ఉన్నతులుగా రవీందర్ తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోట కనకయ్య, కళ్లెం వెంకటరెడ్డి, శ్రీధర్, రామకృష్ణ, జనార్దన్‌రెడ్డి, రాంజీనాయక్, జగన్మోహన్‌రెడ్డి, మహబూబ్ అలీ, ఉమాదేవి, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కేసముద్రం, జూలై 29 : కేసముద్రం మండలం సబ్‌స్టేషన్‌తండాలో సోమవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలను రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని వాంకుడోత్ తరుణ్‌నాయక్ పంపిణీచేశారు. తండాలో వివిధ పాఠశాలలకు చెందిన 67 మంది విద్యార్థులకు రూ.7వేల విలువైన స్టేషనరీ సామగ్రిని అందజేసినట్లు తరుణ్‌నాయక్ తెలిపారు.

నెట్ సిగ్నల్ లేక పింఛన్‌దారుల ఇక్కట్లు

గూడూరు, జూలై 29: గూడూరు మండలం సీతానగరంలో నెట్ సిగ్నల్స్ రాక ఆసరా పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు నెలల నుంచి గ్రామంలో సిగ్నల్ లేకపోవడంతో బీపీఎం పక్కనే ఉన్న మరో గ్రామానికి వెళ్లి అక్కడ సిగ్నల్ చూసుకుని సీతానగరం ఆసరా పింఛన్‌దారులకు నగదును అందజేస్తున్నారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు, ఇతర పింఛన్‌దారులు ఆగ్రామానికి వెళ్లలేక తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. సీతానగరంలో సిగ్నల్ టవర్‌ను ఏర్పాటు చేయా లని ఆసరా పింఛన్‌దారులు కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్లు

▸ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఇనుగుర్తి నుంచి వీరారెడ్డిపల్లెకు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇనుగుర్తి, జూలై 29: ఇనుగుర్తి నుంచి వీరారెడ్డిపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి నెక్కొండకు వెళ్లే వాహనదారులు ఆ దారి గుండానే ఎక్కువగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు గుంతల్లో నీరు చేరి రోడ్డు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదవశాత్తు కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇనుగుర్తి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కురవిలో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

కురవి, జూలై 29: కురవి మండల కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ కార్గో సెంటర్‌ను లాజిస్టిక్స్ వరంగల్ రీజియన్ సేల్స్ టీమ్ లీడర్ ఎస్.రామయ్య సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి పెద్దపెద్ద లగేజీలను తెచ్చుకునేందుకు మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సౌకర్యార్థం కురవిలో కార్గో సెంటర్‌ను ఏర్పాటు చేశామని, కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ టీమ్ పి.నాగేందర్ పాల్గొన్నారు.

కరెంటు ఏఈపై చర్యలు తీసుకోవాలి

గార్ల, జూలై 29: మండల వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కరెంటు సరఫరా చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ విధులు నిర్వహిస్తున్న గార్ల సబ్‌స్టేషన్ ఏఈ మహేంద్రబాబుపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి సోమవారం నాడిక్కడ తెలిపారు. గత రెండు రోజులుగా ఏజెన్సీ గిరిజన తండాల్లో రాత్రి వేళల్లో కరెంటు లేక ప్రజలు, చంటి పిల్లలు అనేక ఇబ్బందులు పడుతుంటే కరెంటును పునరుద్ధరించక పోవడంతో తండాలు చీకట్లో మగ్గుతున్నామయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారులకు ఎలాంటి సమాచారం లేకుండానే తమ ఇష్టారాజ్యంగా కరెంటును నిలుపుదల చేస్తున్నారని తెలిపారు. పనిచేయని అధికారులను తక్షణం విధుల నుంచి తప్పించేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

తొర్రూరు, జూలై 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో సంఘం జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని, పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ విద్యా సంస్థలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు అందించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందీశ్వర్, కార్యదర్శిగా రాంచరణ్‌తో పాటు మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో లోకేష్, గణేష్, నరేందర్, వీరన్న, సిద్ధు, రవీందర్, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.